సాక్షి
మహబూబాబాద్
గురువారం । 14 । ఆగస్టు । 2025



కాకతీయుల శిల్పకళ అద్భుతం

కాకతీయుల శిల్పకళ అద్భుతమని, నాటి సాంకేతిక పరిజ్ఞానానికి నిదర్శనమని కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. - 8లో▸



పీటలపై ఆగిన పెళ్లి..

పెళ్లికొడుకు తనతో ప్రేమాయణం సాగించాడని ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పెళ్లిపీటల మీదనే మూడుముళ్ల బంధం ఆగింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
33.2^0 /22.9^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పాకాల ఏటి వరద ఉధృతి పరిశీలన



గార్ల: గార్ల సమీపంలో చెక్‌డ్యామ్ పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న పాకాల ఏరును బుధవారం ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ పరిశీలించారు. పాకాల ఏటి చెక్‌డ్యామ్ వద్ద ప్రమాదాలను నివారించేందుకు రహదారికి అడ్డుగా బారికేడ్లు ఏర్పాటు చేసి డ్యూటీ పోలీసును నియమించాలని స్థానిక ఎస్సై రియాజ్‌పాషాను ఆదేశించారు. ఏరు ఉధృతి తగ్గేంత వరకు పగలు, రాత్రి వేళల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితి తలెత్తితే తానే స్వయంగా హాజరవుతానని ఎస్పీ హామీ ఇచ్చారు. ప్రతీరోజు వరద ఉధృతి ఫొటోలను ఎస్పీ కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతిరావు, సీఐ రవికుమార్, ఎస్సైలు ఎస్‌కె రియాజ్‌పాషా, తిరుపతిరావు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సంప్రదాయాలను కాపాడుకోవాలి



గూడూరు: బంజారాలు తమ సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకోవాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మండల తీజ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన తీజ్ నవరాత్రి వేడుకలు బుధవారం ముగిశాయి. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై తీజ్ వేడుకల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం గోధుమ నారు బుట్టలను యువతులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు తలపై పెట్టుకొని సంప్రదాయ నృత్యాలు చేశారు. అనంతరం సమీప పాకాల వాగులో గోధుమ నారు బుట్టలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు ధర్మానాయక్, వాల్యానంద స్వామి, బాలూనాయక్, లక్ష్మణ్‌నాయక్, గోపినాథ్, పెద్దలు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



గార్ల: ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి, అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) విజయనిర్మల హెచ్చరించారు. బుధవారం గార్ల, పుల్లూరు గ్రామాల్లో పలు ఎరువుల దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ పాస్ యంత్రాలతోనే ఎరువుల అమ్మకాలు జరపాలని, నిబంధనలు పాటించని డీలర్లపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. లైసెన్స్‌లో ఓఫారం పొందుపర్చిన ఎరువులనే రైతులకు అమ్మాలని, స్టాక్‌బోర్డులో ఎరువుల నిల్వలు, ధరలు రైతులకు కనబడే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో రైతులకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని తెలిపారు. యూరియాకు బదులు నానో యురియా పంటలకు వాడాలన్నారు. డీఏఓ వెంట ఏఓ కావటి రామారావు, ఏఈఓ కిరణ్, రైతులు ఉన్నారు.

రోడ్డుపై నాటు వేసి నిరసన




బయ్యారం: బురదమయమైన రోడ్డుపై స్థానికులు బుధవారం నాటు వేసి వినూత్న నిరసన తెలిపారు. బయ్యారంలోని బండ్లమాంబ ఆలయ సమీపంలో ప్రధానరహదారి బురదమయంగా మారడంతో ఆ ప్రాంత వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో నాటు నాటువేసి నిరసన తెలుపగా.. విషయం తెలుసుకున్న ఎస్సై తిరుపతి అక్కడికి వెళ్లారు. స్థానికులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడతానని హామీ ఇవ్వడంతో వరినారును తొలగించారు.

గిరిజనేతరుల ఆశలు!

అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనపై చర్చ

- జనరల్ స్థానం వస్తే గిరిజనేతరులు క్రియాశీలకం
- అంత సులువుగా రిజర్వేషన్ మారదని గిరిజన నాయకుల ధీమా
- రోజురోజుకూ పెరుగుతున్న ఉత్కంఠ



సాక్షి, మహబూబాబాద్: అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన మాట వినపడితే చాలు జిల్లాలో ఏ నలుగురు ఒకచోట చేరినా ఇదే చర్చ జరుగుతోంది. గత నాలుగు పర్యాయాలు ఎస్టీ రిజర్వేషన్ ఉన్న నియోజకవర్గాలు ప్రస్తుతం జనరల్‌గా మారే అవకాశం ఉందా అని గిరిజనేతరులు లెక్కలు వేస్తున్నారు. అయితే ఆదివాసీలు, లంబాడ గిరిజనులు ఎక్కువగా ఉన్న జిల్లాలో నియోజకవర్గాల పునర్విభజన జరిగినా జనరల్‌గా మారడం అంత సులువు కాదని గిరిజన నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు పర్యాయాలుగా..

మహబూబాబాద్ జిల్లా కేంద్రం 2009కి ముందు జనరల్ కేటగిరిలో ఉండేది. వరుసగా 2009, 2014, 2018, 2024లో ఎస్టీ రిజర్వేషన్‌తో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అయితే మహబూబాబాద్ జిల్లా ఏర్పాటు తర్వాత జరిగిన భౌగోళిక మార్పులతో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి కలిసిన గార్ల, బయ్యారం మండలాల్లో కూడా అత్యధికంగా గిరిజనులే ఉన్నారు. దీంతో జిల్లాలోని మహబూబాబాద్, డోర్నకల్‌తోపాటు ఇల్లెందు, ములుగు నియోజకవర్గాల్లో కూడా ఎస్టీ రిజర్వేషన్ కొనసాగుతూ వస్తోంది

ఏ ప్రాతిపదిక పునర్విభజన..


తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, కొత్త మండలాలు ఏర్పడ్డాయి. ఈక్రమంలో ఒక్కో నియోజకవర్గం మూడు జిల్లాల పరిధిలోకి వెళ్లింది. దీంతో ఎమ్మెల్యే మూడు జిల్లాల జెడ్పీ, ఇతర రివ్యూ మీటింగ్‌లకు హాజరు కావాల్సి వస్తోంది. అదే విధంగా ప్రభుత్వ పథకాల అమలులో కూడా మండలం ఒక జిల్లా, నిధుల కేటాయింపు మరో జిల్లాలో జరుగుతోంది. దీంతో ఎవరు ఎక్కడ దృష్టి సారించలేక అభివృద్ధి కుంటుపడుతోంది. ఈ పరిస్థితుల్లో కొత్త జిల్లాల ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన జరిగితే బాగుంటుందనే ఆలోచన ఉంది. అయితే పునర్విభజన అంశం కేంద్ర ప్రభుత్వ పరిధిలోనిది కావడంతో కొత్త జిల్లాలను పరిగణనలోకి తీసుకోకపోవచ్చనే చర్చ జరుగుతోంది. అలా కాకుంటే ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన పునర్విభజన జరగాలి. అప్పుడు మళ్లీ బయ్యారం, గార్ల మండలాలు ఖమ్మం జిల్లా పరిధిలోకి వెళ్తాయి. అప్పుడు మళ్లీ ఇబ్బందులు తలెత్తుతాయి. కాగా ఏ ప్రాతిపదికన విభజన జరుగుతుందనే దానిపై స్పష్టత లేదు.

ఆ రెండు పట్టణాలపైనే గిరిజనేతరుల ఆశలు

నియోజకవర్గాల పునర్విభజన జరిగితే మహబూబాబాద్, తొర్రూరు పట్టణాలు మాత్రమే జనరల్ కేటగిరీలోకి వెళ్లే అవకాశాలు ఉన్నాయి. ఈ ప్రాతిపదికను అంచనా వేసే అధికార పార్టీకి చెందిన కీలక నాయకులు మహబూబాబాద్, కేసముద్రం పట్టణాలకు నిధులు తీసుకువచ్చి తమ మార్కును చాటుకుంటున్నారనే చర్చ జరుగుతోంది. అదే విధంగా తొర్రూరు, పెద్దవంగర, దంతాలపల్లి, నర్సింహులపేట, నెల్లికుదురు మండలాలు కలిపి తొర్రూరు కేంద్రంగా కొత్త నియోజకవర్గం ఏర్పడే అవకాశాలు ఉన్నట్లు చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఉన్న డోర్నకల్, మరిపెడ, చిన్నగూడూరు, కురవి, సీరోలుకు తోడు గార్ల మండలాన్ని కలిపి ఒక నియోజకవర్గం, బయ్యారం, గంగారం, కొత్తగూడ, గూడూరు మండలాలు కలిపి ఏజెన్సీ నియోజకవర్గంగా ఏర్పాటు చేసే అవకాశాలు లేకపోలేదు. అప్పుడు కొత్త జిల్లా పరిధిలోనే నియోజకవర్గం ఉంటుందని, అభివృద్ధి చేయడం కూడా సులభం అవుతుందని అధికార పార్టీ నాయకులతో పాటు ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు అంటున్నారు. అందుకోసమే రాజకీయాల్లో ఉన్నవారు, కొత్తగా రాజకీయాల్లోకి వచ్చే గిరిజన, గిరిజనేతర నాయకులు రిజర్వేషన్ తేలిన తర్వాతనే క్రియాశీలక రాజకీయాలు చేయాలని, అప్పటి వరకు ప్రస్తుత పరిస్థితినే కొనసాగించాలనే ఆలోచనలో ఉన్నట్లు అనుచరులు చెబుతున్నారు. ఇలా ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నా.. చివరకు ఏం జరుగుతుందో అనేది నాయకుల్లో ఉత్కంఠగా మారింది.

ఉదయం 9.30 గంటలకే పతాకావిష్కరణ

- పంద్రాగస్టు వేడుకలకు ప్రభుత్వం ఉత్తర్వులు
- మహబూబాబాద్‌కు రామచంద్రునాయక్..



సాక్షిప్రతినిధి, వరంగల్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం పంద్రాగస్టు రోజున జిల్లాకేంద్రాల్లో ఉదయం 9.30 గంటలకే జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉమ్మడి వరంగల్‌లో జిల్లాల వారీగా వేడుకలకు హాజరయ్యే మంత్రులు/ప్రముఖుల జాబితాను బుధవారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు విడుదల చేశారు. హనుమకొండ జిల్లా పోలీసు పరేడ్‌గ్రౌండ్స్‌లో అటవీశాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. వరంగల్‌లో రెవెన్యూశాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ములుగులో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) జాతీయ పతాకాలను ఆవిష్కరించనున్నారు. అదే విధంగా మహబూబాబాద్‌లో డిప్యూటీ స్పీకర్ జె.రామచంద్రునాయక్, జనగామలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, జయశంకర్ భూపాలపల్లిలో తెలంగాణ ఎస్టీ కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్‌లు జాతీయ పతాకాలను ఆవిష్కరించనున్నారు. జాతీయ పతాకావిష్కరణ అనంతరం గార్డ్ ఆఫ్ ఆనర్‌లో గౌరవ వందనం స్వీకరిస్తారని, అందుకనుగుణంగా చర్యలు తీసుకోవాలని చీఫ్ సెక్రటరీ ఆ ఉత్తర్వుల్లో జిల్లా కలెక్టర్‌లకు సూచించారు.

ముంపు బాధితులకు పునరావాసం కల్పిస్తాం

సాక్షి స్పందన

మరిపెడ రూరల్: గత ఏడాది ఆకేరు వాగు ఉధృతితో మండలంలోని సీతారాంతండా, ఉల్లెపల్లి, బాల్నిధర్మారం గ్రామాల ముంపు బాధితులకు పునరావాసం కల్పిస్తామని తొర్రూరు ఆర్డీఓ గణేష్ అన్నారు. ముంపు గ్రామాల పరిస్థితిపై మంగళవారం సాక్షి దినపత్రికలో 'నెరవేరని హామీ' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు తొర్రూరు ఆర్డీఓ గణేష్ బుధవారం మండలంలోని పురుషోత్తమాయగూడెం బ్రిడ్జి వద్ద ఆకేరు వాగును పరిశీలించారు. ఈ సందర్భంగా సీతారాంతండా బాధిత గిరిజనులతో ఆర్డీఓ మాట్లాడారు. ప్రభుత్వం ముంపు గ్రామాల ప్రజలకు అండగా ఉంటుందని, ఎవరు కూడా అధైర్యపడొద్దనిసూచించారు. ముందస్తు చర్యల్లో భాగంగా సురక్షిత ప్రాంతంలో పునరావాసం కల్పిస్తామని వారికి భరోసా కల్పించారు. మరిపెడ తహసీల్దార్ కృష్ణవేణి, ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



సీతారాంతండా ముంపు బాధితులతో మాట్లాడుతున్న ఆర్డీఓ గణేష్



యూరియా కోసం రైతుల బారులు

నెల్లికుదురు: మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయం వద్ద బుధవారం యూరియా బస్తాల కోసం రైతులు బారులుదీరారు. కాగా లైన్‌లో నిల్చున్న చాలామందికి బస్తాలు దొరకకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. ఉదయం బస్తాలు వచ్చాయని తెలియగానే రైతులు ఆగమేఘాల మీద వచ్చి లైన్‌లో నిల్చున్నా.. బస్తాలు దొరకకపోవడంతో ఆందోళన వ్యక్తం చేశారు. మూడు రోజుల నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా.. బస్తాలు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఇన్‌చార్జ్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో

మరిపెడ రూరల్: వర్షాల నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ లెనిల్ వత్సల్ టొప్పో అన్నారు. గత ఏడాది ముంపునకు గురైన మండలంలోని పురుషోత్తమాయగూడెం పరిధి ఆకేరు వాగు బ్రిడ్జిని బుధవారం పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందున చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదకరంగా ప్రవహించే వాగులు, వంకల వద్దకు ప్రజలు వెళ్లకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా చూడాలని, రాత్రి వర్షం పడితే సహాయక చర్యలు చేపట్టేందుకు రిలీఫ్ క్యాంపులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం జరిగిందని, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో మరిపెడ తహసీల్దార్ కృష్ణవేణి, రాజేశ్వర్‌రావు, ఆర్‌ఎస్ శరత్‌చంద్ర, మున్సిపల్ కమిషనల్ విజయానంద్, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, పంచాయతీ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

మహబూబాబాద్: అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలను కూడా అలర్ట్ చేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని నిజాం చెరువు, బంధం చెరువును బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలను అధికారులు తప్పనిసరిగా పాటించాలన్నారు. లోతట్టు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రాజేశ్వర్, అధికారులు ఉన్నారు.



ఆకేరు వాగు బ్రిడ్జి వద్ద పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ లెనిల్ వత్సల్ టొప్పో

వ్యాధులపై జాగ్రత్తలు అవసరం

మరిపెడ: విద్యార్థులు వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. మరిపెడలోని మహాత్మా జ్యోతిరావుపూలే బాలికల వసతి గృహాన్ని బుధవారం సందర్శించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రుచికరమైన వేడివేడి ఆహారం వడ్డించాలన్నారు. మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని మాకుల పెద్దచెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాల నేపథ్యంలో చెరువులు, కుంటల వద్ద అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. తహసీల్దార్లు కృష్ణవేణి, రాజేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ విజయానంద్, ఎంపీడీఓ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా 'భువన్' సర్వే

ఇళ్ల కొలతలు, ట్రేడ్ లైసెన్స్‌ల వివరాలు యాప్‌లో నమోదు

- వందరోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మున్సిపాలిటీల్లో సర్వే
- కొలతల్లో తేడాలు ఉంటే పన్ను పెంపు

మహబూబాబాద్: జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో వందరోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా భువన్ సర్వే చేపడుతున్నారు. యాప్‌లో ఇళ్ల వివరాలను నమోదు చేస్తున్నారు. అలాగే ట్రేడ్ లైసెన్స్‌లు కమర్షియల్‌లో ఉన్నాయా, రెసిడెన్షియల్‌లో ఉన్నాయా అనే అంశాలను కూడా సర్వేలో నమోదు చేస్తున్నారు. ఇళ్ల కొలతల్లో తేడాలు ఉంటే పన్ను పెంచి ఆన్‌లైన్ చేస్తున్నారు. కాగా, ఈ సర్వే ద్వారా మున్సిపాలిటీ ఆదాయం పెరుగుతుందని అధికారులు అంటున్నారు.

ఐదు మున్సిపాలిటీలు..

జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు ఉన్నాయి. మానుకోట మున్సిపాలిటీ పరిధిలో 36 వార్డులు ఉండగా 57,828మంది ఓటర్లు, 68,889 మంది జనాభా, 25,000 పైచిలుకు గృహాలు ఉన్నాయి. తొర్రూరు మున్సిపాలిటీలోని 16 వార్డుల్లో 19,100 జనాభా ఉంది. మరిపెడలో 15 వార్డులు, 17,875 మంది జనాభా, డోర్నకల్‌లో 15 వార్డులు, 14,425 మంది జనాభా ఉంది. ఇటీవల కేసముద్రం మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయ్యింది. ఈ ఏడాది జూన్ 2నుంచి వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగానే భువన్ సర్వే నిర్వహిస్తున్నారు.



మానుకోట మున్సిపాలిటీ పరిధి 36వ వార్డులో సర్వే చేస్తున్న సిబ్బంది(ఫైల్)

కొనసాగుతున్న సర్వే..

ఐదు మున్సిపాలిటీల్లో భువన్ సర్వే జరుగుతోంది. ప్రతీవార్డులో వార్డు ఆఫీసర్‌తో పాటు బిల్ కలెక్టర్ మరో ఇద్దరి సిబ్బందితో భువన్ సర్వే చేస్తున్నారు. ప్రతీ ఇంటిని ఆ యాప్‌లో నమోదు చేయడమే సర్వే లక్ష్యం. కాగా, గూగుల్ ద్వారా లొకేషన్‌లో అన్ని వివరాలు తెలుసుకునే అవకాశం యాప్ ద్వారా కలుగుతుంది. మానుకోట మున్సిపాలిటీలో 25,262 గృహాలు ఉండగా.. దాదాపు 23,000 గృహాలు నమోదు అయ్యాయి. 2,262 ఇళ్లు భువన్ యాప్‌లో నమోదు కాలేదు. అయితే ఆన్‌లైన్‌లో నమోదై పన్ను చెల్లిస్తున్నప్పటికీ భువన్ యాప్‌లో నమోదు కాలేదు. కాగా 2,262 ఇళ్లకు గానూ 1400ఇళ్లకు వెళ్లి కొలతలు వేసి యాప్‌లో నమోదుచేశారు. కొలతలు వేసి అదనంగా నిర్మాణాలు ఉంటే వాటిని నమోదు చేస్తున్నారు. తద్వారా ఆ ఇళ్లకు చెల్లించే పన్ను పెరిగి మున్సిపాలిటీలకు మరింత ఆదాయం సమకూరుతుంది.

సీడీఎంఏ ఆదేశాలతో..

సీడీఎంఏ ద్వారా వచ్చిన ఇళ్ల జాబితా ఆధారంగా భువన్ సర్వే చేస్తున్నట్లు మున్సిపల్ సిబ్బంది తెలిపారు. ఆన్‌లైన్ వివరాలకు.. యాప్‌లో నమోదైన వివరాల్లో తేడా ఉంటే దాని ప్రకారం పన్ను విధిస్తున్నారు. అలాగే ట్రేడ్ లైసెన్స్‌లపై కూడా ఆయాప్ ద్వారా సర్వే చేస్తున్నారు. గతంలో ట్రేడ్ లైసెన్స్‌లు కమర్షియల్‌లో ఉన్నాయా.. రెసిడెన్షియల్‌లో ఉన్నాయా అని చూడకుండా లైసెన్స్‌లు జారీ చేశారు. కాగా, సర్వే ద్వారా వాటి లెక్క కూడా తేలుతోంది. దీంతో కమర్షియల్ భవనమైతే లైసెన్స్ పన్ను పెంచుతున్నారు. ఒక్క మానుకోట మున్సిపాలిటీ పరిధిలో 1150 ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ఈనెలలో సర్వే పూర్తి

రెండు నెలలుగా భువన్ సర్వే జరుగుతోంది. దీంతో ఇళ్ల వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. సర్వే ద్వారా అదనపు నిర్మాణాలు బయట పడుతున్నాయి. దాని ప్రకారం ఇంటి పన్ను వేస్తున్నారు. ట్రేడ్ లైసెన్స్‌ల వివరాలు కూడా పక్కాగా తెలిసి ఆదాయం పెరుగుతోంది.

- టి.రాజేశ్వర్, మానుకోట మున్సిపల్ కమిషనర్

ప్రమాదాల నివారణకు ప్రత్యేక కృషి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని పాలకేంద్రం వద్ద జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలను ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో చిన్న చిన్న గుంతలు పెద్దగా మారి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లతో చర్చించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టేందుకు కృషి చేసినట్లు చెప్పారు. నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్లపై గుంతలు లేకుండా ఎప్పటిప్పుడు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బ్లాక్, మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తొర్రూరులో గుంతల రోడ్డును పరిశీలించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీగా రాజ్‌కుమార్



కేయూ క్యాంపస్: తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీగా కాకతీయ యూనివర్సిటీ హిస్టరీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం అధిపతి డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన సదస్సులో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజ్‌కుమార్ రెండేళ్లపాటు ఆ పదవిలో ఉంటారు.

ఆకేరు పరవళ్లు

ఎగువన కురుస్తున్న వర్షాలతో మండలంలోని ఆకేరువాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. కాగా వాగు పరీవాహక ఆయకట్టు రైతులు మోటార్లను సరిచేసుకోవడానికి ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులోకి దిగొద్దని అధికారులు హెచ్చరించారు. దీంతో నీరంతా దిగువకు వృథాగా పోతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - చిన్నగూడూరు

ఉధృతంగా ప్రవహిస్తున్న ఆకేరువాగు



'భూ భారతి' దరఖాస్తులను పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ అనిల్‌కుమార్

దంతాలపల్లి: భూభారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తహసీల్దార్, సిబ్బందిని భూభారతి దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం భూ భారతి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. రైతుల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. తహసీల్దార్ సునీల్‌కుమార్, ఆర్ఐ రాజు, డీటీ శ్రీలత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న అదనపు కలెక్టర్ అనిల్‌కుమార్

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

మహబూబాబాద్: డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని అదనపు కలెక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్, ఇతర అంశాలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. మాదక ద్రవ్యాల నిరోధకంపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు, అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని అధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీడబ్ల్యూఓ శిరీష, బీసీ వెల్ఫేర్ అధికారి నర్సింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాలింగార్చన

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని కాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా 'మహాలింగార్చన' పూజా కార్యక్రమాన్ని వైభవంగా వేద మంత్రోచ్ఛరణలతో నిర్వహించారు. బుధవారం ప్రదోషకాలంలో ఉపప్రధాన అర్చకుడు పనకంటి ఫణీంద్రశర్మ, అర్చకులు వెల్ది శరత్‌చంద్ర, వేద పండితులు ప్రధాన ఆలయం అనివెట్టి మండపంలో మహాలింగార్చన కార్యక్రమాన్ని విశేష పూజలతో నిర్వహించారు. ఒండ్రు మట్టితో 365 మృత్తిక లింగాలను తయారుచేసి ప్రత్యేకంగా మహా రుద్రాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు చేశారు. ఈ పూజ చేయ దం వల్ల సంవత్సర కాలం మహాశివుడికి పూజించిన ఫలం వస్తుందని భక్తుల నమ్మకం.

పరికరాలు లేవు.. వైద్యం అందించలేము

- ఎంజీఎంలో కొనసాగుతున్న రెఫరల్ ట్రీట్‌మెంట్
- మూడు రోజులుగా వైద్యం కోసం క్యాజువాలిటీ ఎదుట పడిగాపులు
- సోషల్ మీడియా కథనాలతో రోగి వద్దకు వైద్యులు



బాధితుడిని వైద్యం కోసం తరలిస్తున్న పరిపాలనాధికారులు

ఎంజీఎం : పూర్తిస్థాయి వైద్యాధికారులు లేకపోవడం, హెచ్‌ఓడీలు చుట్టపు చూపుగా వచ్చి వెళ్తుండడం, వారిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు జంకుతుండడం వెరసి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో పెద్ద సార్లు ఉంటారు అని భరోసాతో వస్తున్న రోగులకు ఆశించిన మేర వైద్యం అందడం లేదు. అలాంటి ఘటనే ఇది. జూనియర్ వైద్యుల పర్యవేక్షణలో వందలాది మంది రోగులకు చికిత్సలు అందిస్తున్న క్రమంలో పైల్స్‌తో బాధపడే ఓ రోగికి ఎంజీఎం ఆస్పత్రిలో వైద్యం అందించలేమని గెంటేసినంతా పనిచేశారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పరిపాలనాధికారులు క్యాజువాలిటీ వద్దకు పరుగులు పెట్టి సదరు రోగిని అడ్మిట్ చేసుకుని చికిత్స అందించడం మొదలు పెట్టారు. వివరాలోకి వెళ్తే.. వరంగల్ జిల్లా రాయపర్తి మండం కొండూరు గ్రామానికి చెందిన బాచబోయిన రత్నాకర్ అనే వ్యక్తి కడుపునొప్పి భరించలేక భార్య బుచ్చమ్మతో కలిసి సోమవారం ఎంజీఎం ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వచ్చారు. పరీక్షలు చేసిన వైద్యులు పైల్స్ సమస్య ఉన్నట్లు గుర్తించారు. వైద్యం చేయడానికి అవసరమైన పరికరాలు అందుబాటులో లేవని చెప్పి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి వెళ్లాలని రెఫర్ చేశారు. దీంతో ఏమీ తోచని స్థితిలో సదరు రోగి మూడు రోజులుగా ఎంజీఎం ఆస్పత్రి ఎదురుగా ఉన్న రేకుల షెడ్‌లోనే వేచి ఉన్నాడు. ఈ విషయం బుధవారం సోషల్ మీడియాలో రావడంతో వెంటనే ఎంజీఎం పరిపాలనాధికారులు కార్యాలయాలు వదిలి క్యాజువాలిటీ వద్దకు పరుగులు పెట్టారు. బాధితుడిని స్వయంగా అత్యవసర విభాగంలో చేర్పించి చికిత్స మొదలు పెట్టారు. కాగా, చివరకు మెరుగైన చికిత్స నిమిత్తం మళ్లీ హైదరాబాద్‌కు తరలించారు.

ట్రాక్టర్ ప్రమాదంలో విద్యార్థి మృతి



షేక్ ఫరాజ్ అహ్మద్ మృతదేహం

శాయంపేట : ట్రాక్టర్ ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి మండలంలోని నేరేడుపల్లి శివారులో చోటు చేసుకుంది. ఎస్సై పరమేశ్ కథనం ప్రకారం.. ఆత్మకూరు మండలం హౌజుబుజుర్గు గ్రామానికి చెందిన షేక్ ఫరాజ్ అహ్మద్ (16) శాయంపేట మండలం నేరేడుపల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో రోజు మాదిరి మంగళవారం పాఠశాలకు వెళ్లాడు. సాయంత్రం 4 గంటలకు ఇంటికి వెళ్లే సమయంలో పాఠశాల ఎదుట హౌజుబుజుర్గు గ్రామానికి చెందిన షేక్‌షబినాబీకి చెందిన ట్రాక్టర్‌ను డ్రైవర్ ఉమర్ నడుపుకుంటూ వస్తుండగా షేక్ ఫరాజ్ అహ్మద్‌తో పాటు కొంత విద్యార్థులు ఎక్కారు. ఈ క్రమంలో నేరేడుపల్లి శివారులోని మలుపు వద్ద డ్రైవర్ బ్రేక్ వేయగా ట్రాక్టర్‌లో కూర్చున్న ఫరాజ్ అహ్మద్ ఎగిరి రోడ్డుపై పడగా తీవ్ర గాయాలయ్యాయి. వారి వెనుక వస్తున్న అదే గ్రామానికి చెందిన షేక్ కరీం.. ఫరాజ్ అహ్మద్ తల్లిదండ్రులకు సమాచారం అందించగా వారు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే ఫరాజ్ అహ్మద్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి షేక్ కమల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేటితో ముగింపు

పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్ల కొనసాగింపేనా?

- 2025, ఫిబ్రవరి 12తో కాలపరిమితి ముగియగా ఆరు నెలలు పొడిగింపు
- నేటితో పూర్తి కానున్న పొడిగింపు పాలకవర్గాల కాలపరిమితి
- అయినా సహకార శాఖలో కనిపించని ఎన్నికల హడావుడి
- ఆరు నెలల వరకు ప్రస్తుత పాలకవర్గాన్ని పొడిగించే అవకాశం



ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం

హన్మకొండ : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల గడువు ముగుస్తోంది. దీంతో పాలకవర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. తమను పర్సన్ ఇన్‌చార్జ్ చైర్ పర్సన్లుగా, కమిటీలుగా కొనసాగిస్తారా? లేక పదవీ కాలపరిమితి ముగియడంతో వైదొలగాల్సి వస్తోందా అనే మీమాంసంలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రస్తుత పాలకవర్గం ఎన్నిక ముందు గత పాలక వర్గాన్ని పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా కొనసాగించారు. ఈసారి కూడా ప్రస్తుత పాలక వర్గాలకు ఆరు నెలల పొడిగింపు ఇచ్చారు. పొడిగింపు కాలపరిమితి నేటి(గురువారం)తో ముగుస్తుంది. దీంతో మరోసారి తమకే అవకాశం దక్కుతుందనే ఆశల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్లు ఉన్నారు.

సహకార శాఖలో కనిపించని ఎన్నికల సన్నాహాలు..

ఓ వైపు స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లా ప్రజాపరిషత్‌లు, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయాలు సమాయత్తమవుతున్నాయి. ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసుకుంటున్నాయి. అయితే ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పాలకవర్గం కాల పరిమితి ముగిసి ఒకసారి పొడిగింపు అవకాశమిచ్చి ఆ కాలపరిమితి కూడా ముగుస్తున్నా ఆ శాఖలో ఎన్నికల సన్నాహాలు కనిపించడం లేదు. దీంతో ఇప్పట్లో సహకార ఎన్నికలు జరిపే అవకాశం కనిపించడం లేదు. ఈ క్రమంలో ప్రస్తుత పాలక వర్గాలు తమకు పొడిగింపు లభించొచ్చని ఆశిస్తున్నాయి.

2020, ఫిబ్రవరి 15న పీఏసీఎస్‌లకు ఎన్నికలు..

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు 2020 ఫిబ్రవరి 15న ఎన్నికలు జరిగాయి. ఎన్నికలు జరిగి ఐదు సంవత్సరాలు కావడంతో వీటి కాలపరిమితి ఈ ఏడాది ఫిబ్రవరి 14తో ముగిసింది. అదే విధంగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ), ఓరుగల్లు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (ఓడీసీఎంఎస్)ల కాల పరిమితి ఈ ఏడాది ఫిబ్రవరి 29తో ముగిసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 99 పీఏసీఎస్‌లు ఉండగా వరంగల్ డీసీసీబీ పరిధిలో 91 సంఘాలున్నాయి. వరంగల్ డీసీసీబీ పూర్వ వరంగల్ జిల్లా పరిధి మేరకు విస్తరించి ఉంది. వరంగల్ డీసీసీబీ పరిధిలో హనుమకొండ జిల్లాలో 14 పీఏసీఎస్‌లు, భూపాలపల్లి జిల్లాలో 6, జనగామలో 14, మహబూబాబాద్‌లో 16, ములుగులో 11, సిద్దిపేటలో 2, వరంగల్ జిల్లాలో 28 పీఏసీఎస్‌లున్నాయి. అయితే నూతనంగా ఏర్పాటైన జిల్లాల వారీగా చూస్తే.. హనుమకొండ జిల్లాలో 16, వరంగల్‌లో 28, జనగామలో 14, మహబూబాబాద్‌లో 19, ములుగులో 12, జేఎస్ భూపాలపల్లి జిల్లాలో 10 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయి.

మరోసారి అవకాశం లభిస్తుందని పాలకవర్గాల ఆశ..

గత ప్రభుత్వం పీఏసీఎస్‌ల కాలపరిమితి ముగిసినా వాటినే పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా కొనసాగించింది. సహకార చట్టం ప్రకారం ఎన్నికలు నిర్వహించలేక పోతే ఆరు నెలల పాటు పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించొచ్చు. ఈ మేరకు ప్రస్తుత పాలకవర్గానికి ముందు ఉన్న కమిటీలను ఆరు మాసాల చొప్పును నాలుగు పర్యాయాలు పొడిగింపు ఇచ్చారు. దీంతో వారు అదనంగా రెండు సంవత్సరాల పాటు పదవుల్లో కొనసాగారు. ఈసారి కూడా గతంలో మాదిరి పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా పొడిగింపు ఇచ్చారు. పొడిగింపు కాలపరిమితి ముగియనుండడంతో గతంలో మాదిరిగానే మరోసారి అవకాశం దక్కుతుందనే ఆశలో ప్రస్తుత పాలక వర్గాలున్నాయి. డీసీసీబీలకు కూడా ప్రస్తుత పాలకవర్గాలకు పొడిగింపు ఇచ్చారు. ఓడీసీఎంఎస్‌కు మాత్రం ప్రభుత్వం వరంగల్ అదనపు జిల్లా కలెక్టర్‌ను పర్సన్ ఇన్‌చార్జ్‌గా నియమించింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్నికలు జరగగా చాలా వరకు బీఆర్‌ఎస్ నాయకులు, అభిమానులు చైర్మన్లుగా ఎన్నికయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో చాలా మంది పీఏసీఎస్ చైర్మన్లు, మెజారిటీ డీసీసీబీ చైర్మన్లు అధికార కాంగ్రెస్‌లో చేరారు. దీంతో అంతా అధికార పార్టీకి చెందిన వారు కావడంతో మరోసారి తమకు పర్సన్ ఇన్‌చార్జ్ చైర్ పర్సన్లుగా పొడిగింపు లభిస్తుందని ఆశిస్తున్నారు.

16న శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు

- యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ సంగం రెడ్డి సుందర్ రాజు



మాట్లాడుతున్న యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ సుందర్ రాజు యాదవ్

హన్మకొండ: శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఈ నెల 16(శనివారం)న ఘనంగా నిర్వహించనున్నట్లు యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ సంగం రెడ్డి సుందర్ రాజు యాదవ్ తెలిపారు. ఈమేరకు బుధవారం హనుమకొండ రాంనగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణ భారత దేశంలోనే అత్యంత భారీగా ఈ వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. యాదవ కుల దైవం శ్రీ కృష్ణుడు, బలరాముడని తెలిపారు. ప్రస్తుతం సైన్స్, టెక్నాలజీ మీదనే విద్యార్థులు, యువకుల దృష్టి సారిస్తున్నారు. అందుకే భావితరాలకు సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్ర తెలియచెప్పాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ నేపథ్యంలో మూడేళ్లుగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 16న మధ్యాహ్నం 2 గంటలకు రాంనగర్ నుంచి శ్రీ కృష్ణుడి శోభాయాత్ర ప్రారంభమై అంబేడ్కర్ కూడలి, పోలీస్ హెడ్‌క్వార్టర్, అశోక, బస్టాండ్ కూడళ్ల మీదుగా బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం వరకు సాగుతుందన్నారు. అనంతరం కాళోజీ కళాక్షేత్రంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా, మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజుతో పాటు పార్టీలకతీతంగా నాయకులు పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణ జన్మాష్టమీ పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ ప్రతినిధులు కన్నెబోయిన రాజయ్య యాదవ్, గిరబోయిన రాజయ్య యాదవ్, బొంగు అశోక్, కెంచ కుమారస్వామి, రాజేందర్, ఎల్లావుల కుమార్ యాదవ్, రజనీకుమార్, దూడయ్య, చెన్నమల్లు, బుట్టి శ్యాం యాదవ్, బొంగు రాజు యాదవ్ పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి



సుజాత(ఫైల్)

కురవి: పాముకాటుతో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని తిర్మలాపురంలో చోటు చేసుకుంది. ఎస్సై గంద్రాతి సతీశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పూల సుజాత (35) మార్చి 10వ తేదీన మొక్కజొన్న చేనులో పనిచేస్తుండగా పాముకాటు వేసింది. దీంతో కుటుంబసభ్యులు మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోమాలోకి వెళ్లింది. దీంతో ఏప్రిల్ 2వ తేదీన హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఏప్రిల్ 5వ తేదీన మళ్లీ మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి భర్త రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

అంబులెన్స్ తరహా సేవలు..

- టీజీ ఎన్పీడీసీఎల్‌లో ఎమర్జెన్సీ రీస్టోర్ టీం



వరంగల్ సర్కిల్ పరిధి వరంగల్ టౌన్ డివిజన్‌లో సిద్ధంగా ఉన్న ఎమర్జెన్సీ రీస్టోర్ టీం

హన్మకొండ: విద్యుత్ అంతరాయాల నివారణ, త్వరితగతిన పునరుద్ధరణకు టీజీ ఎన్పీడీసీఎల్ అంబులెన్స్ తరహా సేవలకు సిద్ధమైంది. ప్రకృతి వైపరీత్యాలు తలెత్తినప్పుడు, ఈదురు గాలులు, భారీ వర్షాల నేపథ్యంలో కలిగే విద్యుత్ అంతరాయాలు తగ్గించడంతోపాటు యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టడానికి ఎమర్జెన్సీ రీస్టోర్ టీంలను ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా ఎమర్జెన్సీ రిస్టోర్ టీం వాహనంతోపాటు సిబ్బంది, మెటీరియల్ నిత్యం అందుబాటులో ఉంటుంది. సమస్య తలెత్తిన క్షణాల్లో ఈ వాహనం అంబులెన్స్‌లా దూసుకెళ్తుంది. జీపీఆర్ఎస్ లోకేషన్ ద్వారా వేగంగా చేరుకుని సమస్యను పరిష్కరించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తారు. ఈవాహనంలో సంబంధిత మెటీరియల్ థర్మో విజన్ కెమెరాలు, రంపాలు, టార్చ్ లైట్లు, నిచ్చెనలు, ఇన్సులేటర్లు, కండక్టర్లు, కేబుల్స్, ఇతర విద్యుత్ మెటీరియల్ అందుబాటులో ఉంటాయి. సిబ్బంది 24/7 అందుబాటులో ఉంటూ రాత్రి, పగలు అనే తేడా లేకుండా విధులు నిర్వర్తిస్తారు. భారీ వర్షాల నేపథ్యంలో వరంగల్ సర్కిల్‌లో ప్రత్యేక డ్రెస్ కోడ్‌తో సిబ్బంది, మెటీరియల్, ఎమర్జెన్సీ రిస్టోర్ వాహనంతో సిద్ధంగా ఉన్నారు. విద్యుత్ సరఫరాలో ఆటంకం కలిగిన వెంటనే చేరుకునేలా సమాయత్తంగా ఉన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా



వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయాలు లేని విద్యుత్ అందిస్తున్నాం. ప్రకృతి వైపరీత్యాలు, భారీ వర్షాలకు విద్యుత్ అంతరాయం కలిగితే వెంటనే సరఫరా పునరుద్ధరణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నాం. ఈ క్రమంలో ఎమర్జెన్సీ రిస్టోర్ టీంను సిద్ధంగా ఉంచాం. వీరు సమస్య తలెత్తిన వెంటనే వేగంగా చేరుకుని సరఫరా పునరుద్ధరిస్తారు.

– కె.గౌతం రెడ్డి, ఎస్ఈ, వరంగల్ సర్కిల్

పెళ్లి పీటలపై ఆగిన మూడుముళ్ల బంధం..

- పెళ్లి కొడుకు తనను ప్రేమించాడని పోలీసులకు యువతి ఫిర్యాదు
- పోలీసుల సమాచారం మేరకు పెళ్లి ఆపిన వధువు కుటుంబ సభ్యులు



దోర్నకల్: పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న వరుడి బంధువులు

లింగాలఘణపురం: రెండుమూడు గంటల్లో పెళ్లి. బంధుమిత్రులు, కుటుంబ సభ్యులతో ఫంక్షన్ హాల్ సందడిగా మారింది. కానీ ఇంతలో ఓ పిడుగు లాంటి వార్త. పెళ్లి కొడుకు తనతో ప్రేమాయణం సాగించాడని ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు పెళ్లి కూతురు బంధువులకు సమాచారం ఇచ్చారు. దీంతో పెళ్లి పీటల మీదనే మూడుముళ్ల బంధం ఆగింది. ఈ ఘటన మండలంలోని వడిచర్ల సమీపం ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం రాంరాజుపల్లికి చెందిన ఓ యువకుడికి అదే మండలంలోని మరో గ్రామానికి చెందిన యువతితో పెళ్లి నిశ్చయమైంది. బుధవారం వివాహం జరగాల్సి ఉంది. అంతా సిద్ధం చేసుకున్నారు. బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు హాజరయ్యారు. పెళ్లి పీటలపై కూర్చునే సమయంలో సదరు యువకుడితో ప్రేమాయణం సాగించిన ఓ యువతి హైదరాబాద్‌లోని ఓ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సదరు యువకుడు తనతో ప్రేమయాణం కొనసాగించి మరో యువతిని వివాహం చేసుకుంటున్నాడని తెలిపింది. దీంతో వెంటనే స్పందించిన పోలీసులు సదరు యువకుడి వివరాలు తెలుసుకుని పెళ్లి కూతురు బంధువులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఒక్కసారిగా ఫంక్షన్ హాల్‌లో ఆందోళన నెలకొంది. ఏం చేయాలో తెలియని పరిస్థితిలో యువకుడి బంధువులతో వాగ్వాదానికి దిగి పెళ్లిని ఆపారు. ఆ యువకుని విషయం తెలియాలని, అంతవరకు ఊరుకునేది లేదంటూ మండిపడి వధువు బంధువులంతా వెళ్లిపోయారు. ఫలితంగా రెండు మూడు గంటల్లో ఏకమయ్యే జంట విడిపోయింది. దీంతో వివాహానికి హాజరైన బంధువర్గమంతా అవాక్కై, ఎక్కడివారక్కడ వెళ్లిపోయారు.

యాదవనగర్‌లో మరో పెళ్లి..

దోర్నకల్: మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ యాదవనగర్‌లో కొద్ది గంటల్లో జరగాల్సిన వివాహ వేడుక అర్ధాంతరంగా ఆగింది. డోర్నకల్ సీఐ బి.రాజేశ్ కథనం ప్రకారం.. యాదవనగర్‌కు చెందిన మహేశ్ పాతడోర్నకల్ చెందిన తన స్నేహితురాలిని నెల రోజుల క్రితం రహస్యంగా వివాహం చేసుకున్నాడు. ఈ విషయం మహేశ్ ఇంట్లో చెప్పలేదు. దీంతో కుటుంబ సభ్యులు మహేశ్‌కు వేరే సంబంధం చూసి బుధవారం పెళ్లికి ఏర్పాట్లు చేశారు. ఈ విషయం రహస్య వివాహం చేసుకున్న యువతి తెలుసుకుని డోర్నకల్ చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు వివాహ తంతును అడ్డుకుని మహేశ్‌ను పోలీస్ స్టేషన్ తరలించారు. సదరు యువతి బెంగుళూరులో కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తున్నట్లు తెలిసింది.

కాకతీయుల శిల్పకళ అద్భుతం

- కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

విద్యారణ్యపురి: కాకతీయుల శిల్పకళ అద్భుతమని, నాటి సాంకేతిక పరిజ్ఞానానికి నిదర్శనమని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో హిస్టరీ విభాగం ఆధ్వర్యంలో 'కాకతీయాస్ టెంపుల్స్, ఆర్ట్ అండ్ ఆర్కిటెక్చర్' అనే అంశంపై రెండు రోజులు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ ప్రారంభ సభలో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాకతీయుల కాలంలో వివిధ కట్టడాల్లో నాటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాండ్‌బాక్స్ టెక్నాలజీని ఉపయోగించారన్నారు. ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ బి. చంద్రమౌళి మాట్లాడుతూ కాకతీయుల శిల్పకళా సాంస్కృతిక వైభవాన్ని తెలియజేసేందుకు ఈ వర్క్ షాప్ ఒక వేదికగా ఉపయోగపడుతుందన్నారు. సాంస్కృతిక పరిశోధకుడు, తెలంగాణ చరిత్ర బృందం అధ్యక్షుడు శ్రీరామోజు హరగోపాల్ కీలకపోన్యాసం చేస్తూ దక్షిణాసియాలోనే ప్రసిద్ధ హోజసాల చాళుక్య శైలులతో కూడిన కాకతీయుల శిల్పకళా ప్రసిద్ధిగాంచిందన్నారు. రామప్ప, వెయ్యిస్తంభాల ఆలయాల్లో అద్భుత సౌందర్యం దాగి ఉందన్నారు. వరంగల్ నిట్ విశ్రాంత ప్రొఫెసర్ పాండురంగారావు మాట్లాడుతూ ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని ప్రకృతి విపత్తులనుంచి పరిరక్షించుకోవాలన్నారు. కేయూహిస్టరీ విభాగం విశ్రాంత ఆచార్యుడు కె.విజయబాబు మాట్లాడుతూ రామప్పదేవాలయంలో మదనిక, నాగిని వంటి శిల్పాల సౌందర్యం 800 సంవత్సరాలనాటి సాంకేతికత నేటితరానికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. అనంతరం కేయూ పాలకమండలి సభ్యుడు మల్లం నవీన్, హెరిటేజ్ యాక్టివిస్ట్ అరవింద్ ఆర్య, చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ ప్రొఫెసర్ అరుణ మాట్లాడారు. ఈ వర్క్‌షాప్‌లో కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, అధ్యాపకులు సురేశ్‌బాబు,శ్యామ్యూల్‌ప్రవీణ్‌కుమార్, యుగేంధర్, మధు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

యువతిపై సామూహిక లైంగికదాడి

- ఈ ఘటనలో పది మంది యువకుల అరెస్ట్, రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ పండేరిచేతన్ నితిన్



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్

జనగామ రూరల్: ఓ యువతిపై సామూహిక లైంగికదాడికి పాల్పడిన పది మంది నిందితులను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జనగామ పట్టణానికి చెందిన ఓ యువతిపై పది మంది యువకులు మహమ్మద్ ఒవైసీ, ముత్యాల పవన్ కుమార్, బౌద్దుల శివ కుమార్, సూకల రవి, జెట్టి సంజయ్, ఎం.డి అబ్దుల్ ఖయ్యూం, పుస్తకాల సాయి తేజ, ముత్తాడి సుమంత్ రెడ్డి, గుండ సాయి చరణ్ రెడ్డి, ఓరుగంటి సాయిరాం లైంగికదాడికి పాల్పడ్డారు. జూన్‌లో బాధితురాలిని సదరు యువకులు ప్రేమ, స్నేహం పేరుతో కారులో తీసుకుని జనగామ–సూర్యాపేట రోడ్‌లో గల 'టీ వరల్డ్' వెనుక ఉన్న ఒక రూమ్‌లోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డారు. అందులో ఓ యువకుడు ప్రేమిస్తున్నానని బాధితురాలికి మాయమాటలు చెప్పి గోవాకు తీసుకెళ్లి అక్కడ కూడా పలుమార్లు శారీరకంగా కలిశాడు. ఈ ఘటనపై బాధితురాలి చిన్నమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం నిందితులు సిద్దిపేట రోడ్డులో ఉన్నారనే సమాచారం మేరకు సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సై భరత్ అక్కడకు చేరుకుని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. దీంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఏఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. యువత మత్తు పదార్థాలు సేవించినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అత్యవసర సమయాల్లో డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు.

విద్యుత్ పోటీల్లో వరంగల్ సర్కిల్ అత్యుత్తమ ప్రదర్శన



ఎస్ఈ మధుసూదన్ రావు, డీఈ టెక్నికల్ విజేందర్ రెడ్డికి ట్రోఫీలు అందజేస్తున్న క్రీడాకారులు

- హాకీలో ప్రథమ స్థానం, కబడ్డీలో ద్వితీయ స్థానం

హన్మకొండ: టీజీ ట్రాన్స్‌కో, టీజీ డిస్కంల ఇంటర్ సర్కిల్ పోటీల్లో ఉమ్మడి వరంగల్ సర్కిల్ క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. కప్‌లు గెలుచుకున్నారు. 2025–2026 సంవత్సరానికి గాను టీజీ ట్రాన్స్ కో, టీజీ డిస్కంల ఇంటర్ సర్కిల్ పోటీలు ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు నిజామాబాద్‌లో జరిగాయి. ఇందులో హాకీలో ఉమ్మడి వరంగల్ సర్కిల్ జట్టు ప్రథమ స్థానం, కబడ్డీలో ద్వితీయ స్థానం సాధించి ట్రోఫీలు అందుకుంది. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ కార్యాలయంలో ఎస్ఈ పి.మధుసూదన్ రావు, డీఈ టెక్నికల్, సేఫ్టీ ఆఫీసర్ విజేందర్ రెడ్డిని ఇరు జట్ల క్రీడాకారులు కలిసి ట్రోఫీలు అందించారు. ఈ సందర్భంగా వారు క్రీడాకారులను అభినందించారు.

అవయవదానంపై అవగాహన ఉండాలి

- తెలంగాణ నేత్ర అవయవ, శరీర దాతల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి



అవయవదానం పై ప్రతిజ్ఞ చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

హన్మకొండ: అవయవదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ నేత్ర అవయవ, శరీర దాతల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి అన్నారు. ప్రపంచ అవయవ దాన దినోత్సవం సందర్భంగా బుధవారం హనుమకొండ బాలసముద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏకశిల పార్కులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరికీ అవయవ దానం అవసరమని చాటి చెప్పేందుకే ప్రపంచ అవయవ దాన దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. దేశంలో అవయవలేమితో ప్రతీ సంవత్సరం ఐదు లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని, దేశంలో అవయవదానం రేటు అతి తక్కువ ఉందన్నారు. ప్రతీ 10 లక్షల మందికిగాను 0.65 మంది దాతలుగా ముందుకు వస్తున్నారని వివరించారు. పాశ్చాత్య దేశాలు స్పెయిన్, క్రొయేషియాలో 10 లక్షల మందికి గాను 30 మంది దాతలు అవయవదానానికి ముందుకువస్తున్నారన్నారు. భారతదేశంలోనూ అవయవదాతలు ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా అవయవదానంపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు మల్లారెడ్డి, వేణు, ప్రతినిధులు ఎం.పద్మ, నిమ్మల శ్రీనివాస్, భారతి, విజయ కుమారి, నిర్మల, జనార్దన్ రెడ్డి, సత్యనారాయణ, పుల్లారెడ్డి, రాంబాబు, అంజలి, భాస్కర్, శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కల్వల వాసికి అరుదైన అవకాశం

- ఆసియా పసిఫిక్ గ్రామీణాభివృద్ధి కేంద్రంలో ప్రోగ్రాం ఆఫీసర్‌గా వెంకటమల్లు నియామకం



వెంకటమల్లు

కేసముద్రం: రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ(ఎన్ఐఆర్‌డీపీఆర్)లో రీసెర్చ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న మహబూబాబాద్ జిల్లా కేసముంద్రం మండలం కల్వల గ్రామానికి చెందిన తాడబోయిన వెంకటమల్లు అంతర్ ప్రభుత్వ సంస్థ సెంటర్ ఆన్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ ఫర్ ఏషియా అండ్ పసిఫిక్ (సీఐఆర్‌డీఏపీ)లో ప్రోగ్రాం ఆఫీసర్‌గా నియామకమయ్యారు. 15 దేశాల్లో గ్రామీణాభివృద్ధి పేదరిక నిర్మూలన కోసం ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆ సంస్థలో ప్రోగ్రాం ఆఫీసర్‌గా ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు వెంకటమల్లును అభినందించారు. బంగ్లాదేశ్‌లోని ఢాకాలో ఉన్న ఆ సంస్థకు చెందిన ప్రధాన కార్యాలయంలో ప్రోగ్రాం ఆఫీసర్‌గా తనను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు వెంకటమల్లు పేర్కొన్నారు.

మహిళా సంఘాలను మోసం చేసిన ఘటనలో ఒకరికి జైలు

నెల్లికుదురు: డ్వాక్రా మహిళాసంఘాలను మోసం చేసిన ఘటనలో తొర్రూరు కోర్టు.. ఒకరికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధించినట్లు ఎస్సై చిర్ర రమేశ్ బాబు బుధవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన జాటోత్ రామ్మూర్తి ఇదే గ్రామంలోని వరలక్ష్మి గ్రామైఖ్య సంఘం వీఓఏ హెల్పర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో 20 మహిళా సంఘాల పొదుపు డబ్బులు రూ. 4,15,781లను ఆ సంఘాల మహిళలకు తెలియకుండా తన సొంతానికి వాడుకున్నాడు. ఈ ఘటనపై వరలక్ష్మి గ్రామైఖ్య సంఘం అధ్యక్షురాలు కోయగిరి అనిత 2015లో నెల్లికుదురు పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో అప్పటి ఎస్సై ఉపేందర్ రావు కేసునమోదు చేసి విచారణ చేసి కోర్టులో చార్జ్ షీట్ ధాఖలు చేశారు. వాదోపవాదాలు విన్న అనంతరం నేరం రుజువుకావడంతో తొర్రూరు కోర్టు మేజిస్ట్రేట్ ధీరజ్‌కుమార్.. నిందితుడు రామ్మూర్తికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్సై తెలిపారు.